సాక్షి
కర్నూలు
శుక్రవారం | 27 | సెప్టెంబర్ | 2024



42 మంది ఎంపీడీఓల బదిలీ

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 42 మంది ఎంపీడీఓలను బదిలీ అయ్యారు. అయితే బదిలీ అయిన వారిని అక్టోబర్ 2వ తేది వరకు రిలీవ్ చేయవద్దని ఆదేశాలు వచ్చాయి. 8లో



కదం తొక్కిన ఉత్సాహం

జిల్లా స్థాయి యువజనోత్సవాలు/సాంస్కృతిక పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఈ పోటీలు ఆకట్టుకున్నాయి. 8లో



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1,633
ప్రస్తుతం	:1,631.84
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:101.148
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:11,368
అవుట్ ఫ్లో	:12,033

న్యూస్‌రీల్

పింఛన్ల పంపిణీకి రూ.195.18 కోట్లు

- సెప్టెంబర్ నెలతో పోలిస్తే 1,561 పింఛన్ల కోత

కర్నూలు(అగ్రికల్చర్): ఎన్‌టీఆర్ పెన్షన్ కానుక కింద అక్టోబర్ నెలకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో 4,60,068 పింఛన్లకు రూ.195.18 కోట్లు మంజూరయ్యాయి. సెప్టెంబర్ నెలతో పోలిస్తే అక్టోబర్ నెలలో కర్నూలు జిల్లాలో 740, నంద్యాల జిల్లాలో 821 ప్రకారం ఉమ్మడి జిల్లాలో 1,561 పింఛన్లపై కోత పడింది. కూటమి ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా పింఛన్లలో కోత విధిస్తోంది. సెప్టెంబర్ నెలలో ఉమ్మడి జిల్లాలో మొత్తం పింఛన్లు 4,61,629 ఉండగా.. అక్టోబర్ నెలకు సంబంధించి 4,60,086కు తగ్గిపోయాయి. కర్నూలు జిల్లాలో 2,41,843 పింఛన్లకు సంబంధించి రూ.102.97 కోట్లు, నంద్యాల జిల్లాలో 2,18,225 పింఛన్లకు సంబంధించి రూ.92.21 కోట్ల ప్రకారం రూ.195.18 కోట్లు మంజూరయ్యాయి. అక్టోబర్ 1న సచివాలయ ఉద్యోగులు పింఛన్ల పంపిణీ చేపట్టనున్నారు. యథావిధిగా పింఛన్లు రెండు రోజులు మాత్రమే పంపిణీ చేయనుండటం గమనార్హం.

దిశ వన్‌స్టాప్ కేంద్రం తనిఖీ

కర్నూలు (లీగల్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి గురువారం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని దిశ వన్‌స్టాప్ కేంద్రం, మహిళా ప్రాంగణం (శక్తి సదన్)ను తనిఖీ చేశారు. కార్యాలయాలకు సంబంధించిన రిజిస్టర్లు, సౌకర్యాలు, పరిశుభ్రతను పరిశీలించారు. వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలుసుకున్నారు. అక్కడ ఉన్న వారికి లీగల్ సర్వీసెస్ యాక్ట్ 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయాన్ని పొందేందుకు అర్హులని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు డీపీఓ ఎవరు ?

- ఇద్దరికి పోస్టింగ్ ఇచ్చిన ప్రభుత్వం

కర్నూలు(అర్బన్): జిల్లా పంచాయతీ అధికారి ఎవరన్న సందిగ్ధత నెలకొంది. ఇక్కడ డీపీఓగా విధులు నిర్వహిస్తున్న టి.నాగరాజునాయుడును అనంతపురం డీపీఓగా బదిలీ చేస్తూ ఈ నెల 22న పీఆర్‌అండ్‌ఆర్‌డీ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అదే ఉత్తర్వుల్లో కర్నూలు డీపీఓగా ఇద్దరికి పోస్టింగ్ ఇస్తున్నట్లు పేర్కొంది. విజయవాడలో జీఎస్‌డబ్ల్యూఎస్ అడిషనల్ కమిషనర్‌గా డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న ఎస్.రాంనాథ్‌రెడ్డికి కర్నూలు డీపీఓగా పోస్టింగ్ ఇచ్చారు. అలాగే కర్నూలు డ్వామాలో డీపీఓగా విధులు నిర్వహిస్తున్న జి.భాస్కర్‌కు కూడా కర్నూలు డీపీఓగా పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇద్దరు అధికారులను ఇక్కడకు డీపీఓగా నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ శశిభూషణ్‌కుమార్ జారీ చేసిన ఉత్తర్వుల పట్ల సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

శ్రీశైల దేవస్థానానికి రూ. 4 లక్షల విరాళం



దాత రామాంజనేయులుకు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న పలు సేవా పథకాలకు గురువారం ఇద్దరు భక్తులు రూ. 4 లక్షల విరాళం అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన రామాంజనేయులు అన్నప్రసాద వితరణకు రూ.1,00,100, గోసంరక్షణనిధి పథకానికి రూ.1,00,100, ప్రాణదాన ట్రస్టుకు రూ.1,00,100.. మొత్తం మూడు పథకాలకు రూ.3,00,300 విరాళాన్ని ఆలయ పర్యవేక్షకురాలు టి.హిమబిందుకు అందజేశారు. అలాగే చత్తీస్‌ఘడ్‌కు చెందిన బి.విజయమౌనిక, బైలాలి రూ.1,11,100 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

వాటర్‌షెడ్లను చెరబట్టారు!



అవినీతికి పరాకాష్ట: టీడీపీ హయాంలో 2018లో పత్తికొండ నియోజకవర్గంలోని నిర్మించిన చెక్‌డ్యాం దుస్థితి

- ప్రజాధనం లూటీ చేయడమే టీడీపీ నేతల లక్ష్యం
- అధికార పార్టీ నాయకులతో వాటర్‌షెడ్ల నూతన కమిటీల ఏర్పాటు
- జిల్లాలో 5 ప్రాజెక్టులు, 17 మైక్రో వాటర్‌షెడ్‌లు
- 24,276 హెక్టార్లలో వాటర్‌షెడ్ కార్యక్రమాలు
- ఐదేళ్లలో రూ.53.40 కోట్లు వ్యయం చేసే విధంగా ప్రణాళికలు
- ఇప్పటి వరకు రూ.11.80 కోట్లు ఖర్చు
- మిగిలిన నిధులు కాజేసేందుకు వ్యూహాలు!

కర్నూలు(అగ్రికల్చర్): భూగర్భ జలాలు అట్టడుగున ఉన్న ప్రాంతాల్లో జలసంరక్షణ, పచ్చదనం అభివృద్ధి, వ్యవసాయ ఉత్పాదకత పెంపు లక్ష్యంగా ప్రధానమంత్రి క్రిషి సంచాయ్ యోజన (పీఎంకేఎస్‌వై) డబ్ల్యూడీసీ 2.0 కింద వాటర్‌షెడ్ ప్రాజెక్టులు వైఎస్సార్‌సీపీ హయాంలో మంజూరు అయ్యాయి. ఇందులో భాగంగా జిల్లాకు ఐదు ప్రాజెక్టులు మంజూరు చేశారు. ఒక్కో వాటర్‌షెడ్ కింద ఐదేళ్లలో హెక్టారుకు రూ.22 వేల ప్రకారం ఖర్చు చేయాల్సి ఉంది. జిల్లాలో ఐదు వాటర్‌షెడ్ ప్రాజెక్టులు ఉండగా... వీటి కింద 24,276 హెక్టార్లలో వివిధ కార్యాక్రమాలు నిర్వహించతలపెట్టారు. ఇందుకు ఐదేళ్లలో రూ.53.40 కోట్లు ఖర్చు చేసేవిధంగా ప్రణాళికలు రూపొందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడమే తరువాయి.. టీడీపీ నేతలు, కార్యకర్తల దృష్టి వాటర్‌షెడ్ నిధులపై పడింది. వెంటనే ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో అధికారులపై ఒత్తిడి తెచ్చి వాటర్‌షెడ్ ప్రాజెక్టులన్నీ తమ ఆధీనంలోకి వచ్చే విధంగా పావులు కదిపారు. ఫలితంగా ఇప్పటికే పలు వాటర్‌షెడ్‌లు టీడీపీ నాయకుల చేతుల్లోకి వెళ్లాయి. మిగిలిన వాటిని కూడా తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.

టీడీపీ నేతలు, కార్యకర్తలతో వాటర్‌షెడ్ కమిటీ కమిటీలు

జిల్లాలో ఐదు వాటర్‌షెడ్ ప్రాజెక్టులు ఉండగా.. వీటిని 17 మైక్రో వాటర్‌షెడ్‌లుగా విభజించారు. ప్రతి మైక్రో వాటర్‌షెడ్‌కు వాటర్‌షెడ్ కమిటీ ఉంటుంది. కమిటీలో చైర్మన్, వైస్ చైర్మన్, సెక్రటరీలతో పాటు మరో 10 మంది సభ్యులు ఉంటారు. వాటర్‌షెడ్ నిధులను ఈ కమిటీల ద్వారానే ఖర్చు చేస్తారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన వెంటనే వాటర్‌షెడ్ కమిటీలను దక్కించుకునేందుకు టీడీపీ నేతలు అనేక వ్యూహాలు పన్నుతున్నారు. వైఎస్‌ఆర్‌సీపీ హయాంలో ఏర్పాటు అయిన వాటర్‌షెడ్ కమిటీలు స్వచ్ఛందంగా రాజీనామా చేసే విధంగా ఒత్తిడి తెస్తున్నారు. రాజీనామా చేయడానికి ససేమిరా అంటే బెదిరిస్తున్నారు. మొత్తంగా వాటర్‌షెడ్ కమిటీలను పూర్తిగా తమ చేతుల్లోకి తీసుకుంటున్నారు.

అధికారంలోకి వచ్చిన వెంటనే టీడీపీ నాయకులు ఆదాయ వనరులపై దృష్టి సారించారు. ప్రజాధనాన్ని దోచుకోవడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. ఈ కోవలో వాటర్‌షెడ్‌లను తమ గుప్పిట్లోకి తీసుకుంటున్నారు. పాత కమిటీలను బలవంతంగా తొలగిస్తూ, నూతన కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. వాటిలో టీడీపీ నాయకులు ఉండే విధంగా అధికారులపై ఆ పార్టీ ప్రజాప్రతినిధులు ఒత్తిడి తీసుకొస్తున్నారు. గతంలో భారీ అవినీతి, అక్రమాలకు పాల్పడిన వీరు.. ప్రస్తుతం అదే పంథాను కొనసాగిస్తుండటం విస్మయానికి గురిచేస్తోంది.

వాటర్‌షెడ్ ప్రాజెక్టు పేరు	మైక్రో వాటర్‌షెడ్లు	ప్రాంతం (హెక్టార్లలో)	ఖర్చుచేసే మొత్తం (రూ.కోట్లలో)
హాలహర్వి	3	4638	10.20
కందనాతి	2	4788	10.53
పెద్దహరివాణం	4	4950	10.89
పోతుగల్	2	5000	11.00
శకునాల	6	4900	10.78
మొత్తం	17	24,276	53.40



ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామంలో వాటర్‌షెడ్ కమిటీ ఎన్నిక కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ, బీజేపీ నాయకులు (ఫైల్)

నిధులు కొల్లగొట్టడమే లక్ష్యం..

వాటర్‌షెడ్ నిధులను కొల్లగొట్టేందుకు టీడీపీ నేతలు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని ఐదు ప్రాజెక్టు కింద 24,276 హెక్టార్లు ఉండగా... రూ.53.40 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. ఇందులో ఎంట్రీపాయింట్ యాక్టివిటీ కింద 2 శాతం, ఎన్‌ఆర్‌ఎం కింద 47 శాతం, పీఎస్‌ఐ కింద 15 శాతం ప్రకారం ఖర్చు చేస్తారు. మిగిలిన 36 శాతం నిధులను వివిధ పరిపాలనా వ్యవహారాలు, ఇతర కార్యక్రమాలకు ఖర్చు చేస్తారు. ఇప్పటి వరకు ఎంట్రీపాయింట్ యాక్టివిటీ కింద రూ.1.02 కోట్లు, ఎన్‌ఆర్‌ఎం కింద 7.35 కోట్లు, పీఎస్‌ఐ కింద 3.43 కోట్లు ఖర్చు చేశారు. మొత్తంగా ఇప్పటి వరకు రూ.11.80 కోట్లు ఖర్చు చేశారు. ఇంకా రూ.40 కోట్లకు పైగా ఖర్చు చేయాల్సి ఉంది. ఈ నిధులతో ప్రధానంగా జల సంరక్షణ పనులు చెక్‌డ్యామ్‌లు, చెక్‌వాల్స్, రాక్‌ఫిల్ డ్యామ్‌లు తదితర పనులతో పాటు పండ్లతోటల అభివృద్ధి, మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతారు. ఈ నిధులపై టీడీపీ నేతలు కన్నేసినట్లు స్పష్టంగా తెలుస్తోంది.

గతంలో ఇలా..

2014 నుంచి 2019 వరకు టీడీపీ అధికారంలో ఉండటంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారు. నీరు- చెట్టు, ఉపాధి పనులు దక్కించుకుని ప్రజధనాన్ని స్వాహా చేశారు. రూ.100 పనిచేస్తే రూ.80 స్వాహా చేసి రూ.20 మాత్రమే ఖర్చు చేశారంటే అవినీతి ఏ స్థాయికి చేరిందో ఊహించవచ్చు. ఉపాధి నిధులతో జలసంరక్షణ పనుల పేరుతో చెక్‌డ్యామ్‌లు పాత వాటికి మెరుగులు దిద్ది నిధులు దోచుకున్నారు. నాటి టీడీపీ నేతల అవినీతి అక్రమాలకు శిథిలమైన చెక్‌డ్యామ్‌లు నిదర్శనంగా ఇప్పటికీ అలాగే ఉన్నాయి. మళ్లీ ఇప్పుడు చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ప్రజాధనం స్వాహా చేయేడమే లక్ష్యంగా అడుగులు వేస్తుండటం గమనార్హం.

ఎక్కడెక్కడ ఎలాగంటే...

- పత్తికొండ నియోజకవర్గం కృష్ణగిరి మండలంలో పోతుగల్, మన్నెకుంట వాటర్‌షెడ్‌లకు నూతన కమిటీలు ఏర్పాటయ్యాయి. కమిటీల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.
- ఓర్వకల్లు మండలంలోని శకునాల ప్రాజెక్టు కింద ఆరు మైక్రో వాటర్‌షెడ్‌లు ఉన్నాయి. ఇందులో శకునాల, తిప్పాయిపల్లి, హుసేనాపురం, కాల్వ మైక్రో వాటర్‌షెడ్‌ల్లో టీడీపీ నాయకులతో కొత్త కమిటీలు ఏర్పాటయ్యాయి. ఓర్వకల్లు, గుట్టపాడు వాటర్‌షెడ్‌లకు కూడా ఇటీవల నూతన కమిటీలు ఏర్పాటు కావడం గమనార్హం.
- ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని కడివెళ్ల మైక్రో వాటర్‌షెడ్‌కు నూతన కమిటీ ఎన్నికల జరగాల్సి ఉంది. కమిటీలో ఎవరెవరు ఉండాల నేదానిపై ఇప్పటికే ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి పేర్లు కూడా ఇచ్చినట్లు తెలుస్తోంది.
- ఆదోని మండలం పెద్దహరివాణం ప్రాజెక్టులో యడవల్లి, పెద్దహరివాణం, బలాదూర్, సంతకుడ్లూరు మైక్రోవాటర్‌షెడ్లు ఉన్నాయి. వీటిల్లో సంతకుడ్లూరు మైక్రో వాటర్‌షెడ్‌కు నూతన కమిటీ ఏర్పాటు అయింది. మిగిలిన వాటికి వచ్చే వారంలో నూతన కమిటీలు ఏర్పాటు కానున్నాయి. ఈ ప్రాజెక్టు పరిధిలోని వాటర్‌షెడ్‌లకు బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి వర్గీయులు, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు వర్గీయులు పోటీపడుతున్నారు.
- ఆలూరు నియోజకవర్గంలోని హాలహర్వి ప్రాజెక్టు పరిధిలోని బాపురం, హాలహర్వి, మాచాపురం వాటర్‌షెడ్‌లకు వచ్చే వారం నూతన కమిటీలు ఏర్పాటు కానున్నాయి. ఈ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే విరూపాక్షి ఉన్నా.. టీడీపీ ఇన్‌చార్జ్ చక్రం తిప్పుతుండటం గమానార్హం.

పది రోజుల్లో నూతన కమిటీల ఏర్పాటు పూర్తి



ప్రతి వాటర్‌షెడ్‌కు ఒక కమిటీ ఉండాలి. ఈ కమిటీ ఆధ్వర్యంలోనే పనులు జరుగుతాయి. ప్రస్తుతం వాటర్‌షెడ్ కమిటీలకు నూతన కార్యవర్గం ఏర్పాటు చేసే ప్రక్రియను చేపడుతున్నాం. ఇది వరకు ఉన్న వాటర్‌షెడ్ కమిటీలు స్వచ్ఛందంగా వైదొలుగుతున్నాయి. ఇప్పటికే కొన్ని కమిటీలు ఏర్పాటయ్యాయి. మరో 10 రోజుల్లో నూతన కమిటీల ఏర్పాటు ప్రక్రియ పూర్తి అవుతుంది. నిబంధనల ప్రకారమే వాటర్‌షెడ్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నాం.

–అమరనాథరెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా

బధిరులు మనోధైర్యంతో విజయం సాధించాలి

- ఏడీ రయిస్ ఫాతిమా



సమావేశంలో మాట్లాడుతున్న రయిస్‌ఫాతిమా

కర్నూలు(అర్బన్): బధిరులు మనోధైర్యంతో అన్ని రంగాల్లో విజయం సాధించాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా కోరారు. గురువారం అంతర్జాతీయ బధిరుల దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ అనుమతితో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. బధిరుల ఉద్యోగ కల్పనకు సంబంధించి 2018-19 నుంచి 2022- 23 వరకు 25 మందికి ఉద్యోగాలు కల్పించడం జరిగిందన్నారు. అలాగే 2024-25వ సంవత్సరానికి వివిధ ప్రభుత్వ శాఖల్లో పోస్టులను గుర్తించడం జరిగిందన్నారు. ఎస్‌ఆర్‌టీ ఎక్స్‌టెన్షన్ జీఓ వచ్చిన అనంతరం నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామని, అప్పుడు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. డాక్టర్ నాగప్రసాద్ మాట్లాడుతూ బధిరులు ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించాలన్నారు. అంతకు ముందు జెడ్పీ నుంచి పాతబస్టాండ్ వరకు బధిరులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల కార్యాలయ పర్యవేక్షకులు సాల్మన్‌రాజు, వివిధ సంఘాల నాయకులు ఖాజా, వాసుదేవరెడ్డి, సాధిక్‌భాష, షుకూర్‌బాషా, రాఘవేంద్రతో పాటు పెద్ద సంఖ్యలో బధిరులు పాల్గొన్నారు.

తగ్గిన ఉల్లి ధర

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉల్లి ధర తగ్గింది. బుధవారం నాటితో పోలిస్తే క్వింటాపై రూ.246 తగ్గినట్లు స్పష్టమవుతోంది. ఈ నెల 25న క్వింటాకు గరిష్ఠంగా రూ.4389, 26న గరిష్ఠ ధర రూ.4,143 లభించింది. పెరగాల్సిన ఉల్లి ధర తగ్గడంతో రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. మార్కెట్‌కు 147 మంది రైతులు 3,720 క్వింటాళ్ల ఉల్లి తీసుకొచ్చారు.

- వేరుశనగ మార్కెట్‌కు 535 క్వింటాళ్లు రాగా.. కనిష్ఠ ధర రూ.2,257, గరిష్ఠ ధర రూ.7,350 లభించింది. సగటు ధర రూ.5389 నమోదైంది.
- మార్కెట్‌కు కొర్రలు 430 క్వింటాళ్లు రాగా.. కనిష్ఠంగా రూ.1,929, గరిష్ఠంగా రూ.2869 లభించింది. సగటు ధర రూ.2296 నమోదైంది.
- సజ్జలు మార్కెట్‌కు 318 క్వింటాళ్లు వచ్చింది. కనిష్ఠ ధర రూ.1,970, గరిష్ఠ ధర రూ.2,101 లభించగా.. సగటు ధర రూ.2061 నమోదైంది.
- ఆముదం ధరలు కూడా నిరాశజనకంగా ఉన్నాయి. ఈ సారి ఆముదం సాగు ఎక్కువగా ఉంది. ధరలో పురోగతి లేకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం అవుతోంది. మార్కెట్‌కు ఆముదాలు 686 క్వింటాళ్లు వచ్చాయి. కనిష్ఠంగా రూ.5,209, గరిష్ఠ ధర రూ.5,949 లభించగా.. సగటు ధర రూ.5902 నమోదైంది.

స్వామీ.. చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించు

- 28న వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి



కర్నూలు (టౌన్): తిరుమల పవిత్రతను మంటగలుపుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వెంకన్నస్వామి మంచి బుద్ధి ప్రసాదించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వరస్వామి వైభవాన్ని, లడ్డూ పవిత్రతను ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న చంద్రబాబు రాజకీయ దుర్బుద్ధితో దిగజార్చే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. అసత్య ప్రచారాలతో ఏమాత్రం సంబంధం లేని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై అపవాదు వేయడం దారుణమన్నారు. చంద్రబాబు నాయుడు చేసిన పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు ఈనెల 28న జిల్లా వ్యాప్తంగా వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, నాయకులు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం



కలెక్టరేట్ ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

- 'స్వచ్ఛతా హీ సేవ'లో కలెక్టర్ రంజిత్‌బాషా



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, అధికారులు

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచేలా ప్రతి అధికారి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం కలెక్టరేట్‌లో కార్యాలయాలు, వాటి ఆవరణలో పరిశుభ్రత పనులు చేపట్టారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు జేసీ డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, డీఆర్వో చిరంజీవి హాజయ్యారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటూ.. ప్రకృతి పరిరక్షించుకుంటాం అంటూ అధికారులతో కలెక్టర్ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలోని ఆయా శాఖల కార్యాలయలను కలెక్టర్, జేసీ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కారిడార్లలో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఓడీలను ఆదేశించారు. వాహనాల పార్కింగ్‌ను క్రమబద్ధీకరించేందుకు శాఖల వారీగా పార్కింగ్ స్థలాలను గుర్తించాలని, ఏ శాఖ సిబ్బంది ఎక్కడ వాహనాలను పార్కింగ్ చేసుకోవాలో నోటిపై చేసేందుకు చర్యలు తీసుకోవాలని డీఆర్వోను ఆదేశించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ రవీంద్రబాబు, కర్నూలు ఆర్‌డీఓ ఎం.శేషిరెడ్డి, అగ్నిమాపక అధికారి అవినాష్ జయసింహ, డీపీఓ నాగరాజునాయుడు, ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి పాల్గొన్నారు.

ఎక్సైజ్‌లోకి 'సెబ్' విలీనం

- ఉమ్మడి జిల్లా పర్యవేక్షకులుగా డిప్యూటీ కమిషనర్
- జిల్లాకో ఎక్సైజ్ సూపరింటెండెంట్
- పాత విధానంలోకి ఎక్సైజ్ స్టేషన్లు
- ఒక్కో జిల్లాలో ఏడు చొప్పున స్టేషన్లు



కర్నూలు: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉన్నట్లుగానే పాత విధానంలోకి ఎక్సైజ్ స్టేషన్లు వచ్చాయి. కర్నూలు జిల్లాకు ఏడు, నంద్యాల జిల్లాకు ఏడు చొప్పున స్టేషన్లు ఉన్నాయి. మద్యం డిపోలు కూడా గతంలో ఉన్నట్లుగానే కేటాయించారు. నూతన మద్యం పాలసీ విధానంలో భాగంగా సెబ్ స్థానంలో ఎక్సైజ్ శాఖకు పునర్వవస్థీకరించి అక్టోబర్ మొదటి వారంలో కొత్తగా మద్యం దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. జిల్లాలో ఉన్నతాధికారుల నియామకం కూడా పూర్తి కావడంతో నూతన పాలసీపై అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాకు నూతనంగా నియమితులైన డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి నూతన ఎక్సైజ్ పాలసీ రూపకల్పనలో కోర్ కమిటీ సభ్యురాలు కావడంతో విధుల్లో చేరిన వెంటనే కలెక్టర్‌ను కలసి జిల్లాలో పాలసీ అమలుపై చర్చించారు. దుకాణాల కేటాయింపు, రుసుముల చెల్లింపు, ఉత్తర్వులు కూడా ఒకటి, రెండు రోజుల్లో వెలువడే అవకాశముంది. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాల్లో చాలా చోట్ల సరుకు నిల్వలు చివరి దశకు చేరినట్లు సమాచారం.

సిబ్బంది కేటాయింపు ఇలా...

ఎక్సైజ్ శాఖ పునర్వ్యవస్థీకరణలో భాగంగా డిస్టిలరీలతో పాటు జిల్లాలో పరిపాలన, ఎన్‌ఫోర్స్‌మెంట్, చెక్‌పోస్టుల నిర్వహణకు సిబ్బందిని కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, కోసిగి, ఆదోని, ఆలూరు, పత్తికొండలో ఎక్సైజ్ స్టేషన్లు ఉన్నాయి. వాటిలో పనిచేసేందుకు 24 మంది సీఐలు, 25 మంది ఎస్‌ఐలు, 28 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 150 మంది కానిస్టేబుళ్లను నియమించారు.

ఏడు చెక్‌పోస్టులు...

జిల్లాలో ఏడు చెక్‌పోస్టులు, ఒక మొబైల్ పెట్రోలింగ్ పార్టీ, ఈఎస్‌టీఎఫ్ స్క్వాడ్, కంట్రోల్ రూమ్, ఐఎంఎల్ డిపో, బీఎంబీపీలను కేటాయించారు. చెక్‌పోస్టులు, స్టేషన్ల పర్యవేక్షణకు సీఐలు, ఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, సిబ్బందిని నియమించాల్సి ఉంది. జిల్లాలో నోడల్ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ల భర్తీ ప్రక్రియ పూర్తి కావడంతో నూతన మద్యం విధానం అమలుపై కసరత్తు ముమ్మరం చేశారు. మద్యం దుకాణాలు, బార్‌ల పర్యవేక్షణతో పాటు సారా, అక్రమ మద్యం, గంజాయి రవాణా విక్రయాలను అడ్డుకట్ట వేసే బాధ్యతలు స్టేషన్లు, టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి అప్పగించారు. ఇప్పటివరకు సెబ్ పర్యవేక్షించిన ఇసుక అక్రమ రవాణా, గుట్కా, ఇతర అంశాలను పోలీసులకు అప్పగించారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఇలా...

ఉమ్మడి జిల్లాలో ఎక్సైజ్ నేరాల నియంత్రణకు పాత పద్ధతిలోనే ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో ఒక ఏఈఎస్, ముగ్గురు సీఐలు, ముగ్గురు ఎస్‌ఐలు, ఆరు మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 17 మంది కానిస్టేబుళ్లను నియమించారు. అలాగే దుకాణాలకు మద్యం సరఫరా చేసే బాధ్యత డిపో మేనేజర్‌కు అప్పగించి కొత్తగా మేనేజర్‌ను నియమించారు. రికార్డుల నిర్వహణతో పాటు దుకాణాలకు మద్యం చేరవేసే బాధ్యత వీరికి ఉంటుంది. ఇందులో ఒక సీఐ, ఒక ఎస్‌ఐ, ఒక హెడ్ కానిస్టేబుల్, ముగ్గురు పీసీలను కేటాయించారు. అలాగే ఈఏటీఎఫ్‌లో ఒక ఏఈఎస్, ఒక ఎస్‌ఐ, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ఐదు మంది పీసీలను కేటాయించారు. యూనిట్ హెడ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పర్యవేక్షణలో వీరు విధులు నిర్వహిస్తారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో పాటు పరిపాలన, నేర పర్యవేక్షణ, స్టేషన్ల పర్యవేక్షణ బాధ్యతలు ఈఎస్‌కు అప్పగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈఎస్‌కు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సహాయకారిగా వ్యవహరిస్తారు.

20 శాతం పెరగనున్న దుకాణాలు

ప్రభుత్వ మద్యం దుకాణాలు తొలగించి కూటమి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు అప్పగించనుంది. మద్యం దుకాణాల అనుమతులకు సంబంధించిన ప్రకటన (గెజిట్) కలెక్టర్ విడుదల చేయాల్సి ఉంది. ఈ విషయంపై ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కలెక్టర్‌తో చర్చించారు. ప్రస్తుతం కర్నూలు జిల్లాలో 83, నంద్యాల జిల్లాలో 93 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. నూతన పాలసీలో అదనంగా మరో 20 శాతం దుకాణాలు పెరగనున్నట్లు సమాచారం. ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు స్వీకరించి లక్కీడిప్ విధానంలో అనుమతులు కేటాయించే విధానం అమలు చేసేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకే బదిలీలు

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకే గ్రామ/వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్ల బదిలీలను నిర్వహించామని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జె.రంగలక్ష్మీదేవి తెలిపారు. ఉద్యోగల బదిలీలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిన నేపథ్యంలో జిల్లాలో 165 మంది వెల్ఫేర్ అసిస్టెంట్లు బదిలీలకు దరఖాస్తు చేసుకున్నార న్నారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ నిబంధనల మేరకు పీడబ్ల్యూడీ, మెడికల్ గ్రౌండ్స్, స్పౌజ్, మ్యూచువల్ కేటగిరీలో 19 మందిని, పరిపాలనా సౌలభ్యంలో భాగంగా 85 మంది వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లను జిల్లా కలెక్టర్ అనుమతితో బదిలీ చేశామన్నారు.బదిలీల్లో ఎలాంటి అవినీతికి తావివ్వకుండా, నిష్పక్షపాతంగా నిర్వహించామన్నారు.

సైబర్ మోసాలపై కేసులు నమోదు చేయండి

కర్నూలు: ప్రాపర్టీ చీటింగ్, సైబర్ మోసాలపై ఫిర్యాదులు వస్తే వెంటనే కేసులు నమోదు చేయాలని కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో గురువారం ఎస్పీ బిందు మాధవ్‌తో కలిసి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు సమావేశానికి హాజరయ్యారు. కర్నూలు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు పోలీస్ సబ్ డివిజన్లలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సమీక్షించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఎస్పీ బిందు మాధవ్ రాబరీ, డెకాయిటీ, రోడ్డు ప్రమాదాలు, లాంగ్ పెండింగ్ కేసులపై చర్చించారు. అనంతరం విధుల్లో ప్రతిభ కనపరచిన పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు, నగదు రివార్డులు అందజేశారు. లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, డీఎస్పీలు వెంకటరామయ్య, శ్రీనివాసాచారి, సోమన్న, ఉపేంద్ర బాబు, శ్రీనివాసరావు, ట్రైనీ డీఎస్పీ ధీరజ్, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

కదం తొక్కిన ఉత్సాహం

- అట్టహాసంగా యువజనోత్సవం
- అలరించిన సాంస్కృతిక పోటీలు
- ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్


సాంస్కృతిక పోటీల్లో భాగంగా నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

కర్నూలు (హాస్పిటల్): జిల్లా స్థాయి యువజనోత్సవాలు/సాంస్కృతిక పోటీలు ఉత్సాహంగా జరిగాయి. జిల్లా యువజన సంక్షేమ శాఖ/సెట్కూరు ఆధ్వర్యంలో గురువారం స్థానిక బి.క్యాంపులోని సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఈ పోటీలకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ వీవీఎస్. కుమార్ హాజరై మాట్లాడారు. యువతలో దాగి ఉన్న పోటీతత్వం, వివిధ అభిరుచులు, కళలు ఇలాంటి కార్యక్రమాల ద్వారా వెలుగులోకి వస్తాయని తెలిపారు. సెట్కూరు ఇన్‌చార్జ్ సీఈఓ పి.దీప్తి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన విజేతలను రాష్ట్రస్థాయికి, రాష్ట్రస్థాయి మొదటిస్థానంలో నిలిచిన విజేతలను జాతీయ స్థాయికి పంపిస్తామన్నారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభ చాటారు. డిస్ట్రిక్ట్ సైన్స్ కౌన్సిల్ సహకారంతో ఏర్పాటు చేసిన ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ కింద ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో దాదాపు 52 ఇంజనీరింగ్, డిగ్రీ, జూనియర్ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు తమ ఆవిష్కరణలు ప్రదర్శించారు. విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు, పాల్గొన్న కళాకారులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సెట్కూరు రిటైర్డ్ సీఈఓ పీవీ. రమణ, జూనియర్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ పి. సోమశివరెడ్డి, ప్రభుత్వ వొకేషనల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ నాగస్వామి నాయక్, సిల్వర్‌జూబ్లీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బీఆర్ ప్రసాద్‌రెడ్డి, కళాశాల తెలుగుశాఖ అధ్యక్షులు డాక్టర్ ఎం. ఫామీదాబేగం, కథారచయిత డాక్టర్ ఎం. హరికిషన్ పాల్గొన్నారు.

పోటీలో విజేతల వివరాలు

వక్తృత్వ పోటీలో.. 1. ఎం. పవిత్ర, 2. ఎస్‌పీ. నజియా, 3. డి. వసంత దీపిక, కన్సోలేషన్ నూర్జహాన్

శాస్త్రీయ నృత్యం(గ్రూపు)లో.. 1. మల్లిక గ్రూపు, 2. ఎస్. శిరీషా గ్రూపు, 3. గాయత్రి గ్రూపు

పెయింటింగ్‌లో.. 1. మంజుశ్రీ, 2. సయ్యద్ సహిస్తా ఫాలక్, 3. జి. స్వరూప

శాస్త్రీయ గీతం(గ్రూపు)లో.. 1. కీర్తన గ్రూపు-ఏపీఎస్‌డబ్ల్యూఆర్ కాలేజి, డీడీ పాడు, 2. వై. వేదవతి గ్రూపు-గవర్నమెంట్ హైస్కూల్, బి.క్యాంపు, కర్నూలు, 3. స్పందన గ్రూపు-సెయింట్ జోసఫ్ కాలేజి ఫర్ గర్ల్స్, కర్నూలు

పోయిట్రీ రైటింగ్‌లో.. 2. ఎం. పవిత్ర (జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజి), 2. ఎస్. ఖాజా(సిల్వర్‌జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల), 3. డి. శ్రీచరిత(ఎస్‌టీబీసీ డిగ్రీ కళాశాల)

స్టోరీ రైటింగ్‌లో.. 1. టి. ఉషారాణి (కేవీఆర్ డిగ్రీ కళాశాల), 2. కె. సుమయ అఫ్రీన్ (రవీంద్ర విద్యానికేతన్), 3. రుక్సానా అన్సారి(హజీరా డిగ్రీ కాలేజి)

థిమాటిక్ కాంపిటీషన్ ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీలో... 1. ఎం. రిషితశ్రీ (రవీంద్ర స్కూల్), 2. జి. వైష్ణవి (కేజీబీవీ స్కూల్), 3. షేక్ జునైద్ (కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కాలేజి)

శాస్త్రీయ నృత్యం(సోలో)లో.. 1. బి. ధరణి, 2. పి. మల్లిక, 3. ఎస్. లిఖిత


వివేకానందుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముఖ్య అతిథులు


యువజనోత్సవ పోటీలకు హాజరైన విద్యార్థినీవిద్యార్థులు


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కర్నూలు ఆర్డీఓగా కిడారి సందీప్‌కుమార్

- పత్తికొండకు భరత్‌నాయక్

కర్నూలు అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీఓల బదిలీల్లో భాగంగా జిల్లాలోని కర్నూలు, పత్తికొండ ఆర్డీఓలకు స్థాన చలనం కలిగిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. విజయనగరం జిల్లా బీసీ సంక్షేమం సాధికారత అధికారిగా విధులు నిర్వహిస్తున్న కిడారి సందీప్‌కుమార్‌ను కర్నూలు ఆర్డీఓగా నియమించారు. ప్రస్తుతం ఇక్కడ ఆర్డీఓగా విధులు నిర్వహిస్తున్న ఎం. శేషిరెడ్డిని జీఏడీలో రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే పలాస ఆర్డీఓగా విధులు నిర్వహిస్తున్న భరత్‌నాయక్‌ను పత్తికొండకు బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్. రామలక్ష్మిని రేపల్లె ఆర్డీఓగా బదిలీ చేశారు.

పారామెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో పారామెడికల్ కోర్సులకు రెండో ఫేజ్ అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టినరసమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల్లో చేరేందుకు మొదటి ఫేజ్‌లో మూడు కౌన్సెలింగ్‌లు పూర్తి కాగా అందులో మిగిలిన సీట్లకు రెండో ఫేజ్ కింద అడ్మిషన్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. ఇంటర్ బైపీసీ విద్యార్హత కలిగిన ఆయా రోస్టర్ కేటగిరీకి చెందిన విద్యార్థులు రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు అక్టోబర్ 7వ తేది సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి అదే నెల 9వ తేదీన ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు. డి.డార్క్ రూమ్ అసిస్టెంట్ కోర్సులో బీసీ (ఎ)కు ఒక సీటు, బీసీ(డీ)కు ఒక సీటు, ఓసీ(ఈడబ్ల్యుఎస్)కు ఒక సీటు, డీఎంఐటీ కోర్సులో ఎస్‌టీకి ఒక సీటు, డీఆర్‌జీఏ కోర్సులో ఓసీ-ఈడబ్ల్యూఎస్‌కు ఒక సీటు, డీఏఎన్‌ఎస్ కోర్సులో బీసీ-సీకి ఒక సీటు, డీఎంఎల్‌టీ కోర్సులో ఓసీ(ఓపెన్ కేటగిరి)కి ఒక సీటు, బీసీ-సీకి ఒక సీటు అందుబాటులో ఉన్నాయన్నారు. దరఖాస్తు వివరాల కోసం www.appmb.co.in లేదా appsahpc.co.inవెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

ఆస్పరి ఎస్‌ఆర్‌గా అరుణ్‌కుమార్

- సస్పెన్షన్ ఎత్తివేసి పోస్టింగ్ ఇచ్చిన డీఐజీ

కర్నూలు(సెంట్రల్): ఆస్పరి సబ్ రిజిస్ట్రార్ (ఎస్‌ఆర్)గా అరుణ్‌కుమార్‌ను నియమించారు. ఆయనపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేసి పోస్టింగ్ ఇచ్చారు. ఈ మేరకు గురువారం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డీఐజీ పీఈఎస్ కల్యాణి ఉత్తర్వులు జారీ చేశారు.

రూ.3 కోట్లతో వ్యాపారి పరారీ!

ఆదోని అర్బన్: పట్టణంలో ఓ లేడీస్ కార్నర్ దుకాణ యజమాని రూ.3 కోట్లతో టోకరా పెట్టి పరారయ్యాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూడటంతో బాధితులు లబోదిబోమంటున్నారు. పట్టణంలోని ఓల్డ్‌టౌన్ ప్రాంతంలో లేడీస్ కార్నర్ దుకాణం ఉంది. షాపు నిర్వహణ పేరుతో పలువురి వద్ద లక్షల్లో అప్పులు తీసుకున్నాడు. వారికి సమయానికి వడ్డీ చెల్లించి నమ్మకం పెంచుకున్నాడు. ఈ నమ్మకంతో రూ.3 కోట్లకు పైగా అప్పులు చేశాడు. తర్వాత దుకాణం నిర్వహించే భవనాన్ని గుట్టుచప్పుడుకాకుండా అమ్మేశాడు. రుణదాతలకు అనుమానం రాకుండా అదే భవనంలో దుకాణాన్ని కొన్ని రోజుల పాటు అద్దెకు కొనసాగించి నాలుగు రోజుల క్రితం కుటుంబంతో సహా పరారయ్యాడు. ప్రస్తుతం దుకాణం మూత పడడంతో అప్పులు ఇచ్చిన వారు ఒక్కొక్కరు అక్కడికి వచ్చి ఆరా తీస్తున్నారు. కొందరు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. కాగా ఇప్పటి వరకు వ్యాపారి పరారీపై బాధితుల నుంచి ఫిర్యాదు అందలేదని వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ వెల్లడించారు. ఇదిలా ఉంటే దుకాణ యజమాని ఇతరుల వద్ద తీసుకున్న డబ్బునంత షేర్ మార్కెట్‌లో పెట్టి నష్టపోయినట్లు విశ్వసనీయ సమాచారం.

42 మంది ఎంపీడీఓల బదిలీ

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 42 మంది ఎంపీడీఓలను బదిలీ చేసినట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. అయితే బదిలీ అయిన వారిని అక్టోబర్ 2వ తేది వరకు రిలీవ్ చేయవద్దని పీఆర్‌అండ్‌ఆర్‌డీ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. గురువారం ఆయన తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ బదిలీ అయిన ఎంపీడీఓలకు అక్టోబర్ 1వ తేదిన బదిలీ ఉత్తర్వులను అందజేస్తామన్నారు.

ఎంపీడీఓల బదిలీల వివరాలు ....

ఎంపీడీఓ పేరు	ప్రస్తుతం పనిచేస్తున్న మండలం	బదిలీ అయిన మండలం
ఆర్ గీతావాణి	ఆదోని	ఆస్పరి
టీ అల్లాబకాష్	ఆలూరు	చిప్పగిరి
ఎం రాణెమ్మ	ఆస్పరి	సి. బెళగల్
జీ మోహన్‌కుమార్	ఆత్మకూరు	కృష్ణగిరి
ఎన్‌సీహెచ్ వాసుదేవగుప్త	బండి ఆత్మకూరు	గడివేముల
సీ వెంగన్న	బేతంచెర్ల	కొలిమిగుండ్ల
ఏసీ రాముడు	సీ బెళగల్	కోడుమూరు
ఎండీ మహబూబ్ దౌలా	చాగలమర్రి	మహానంది
సీవీ కొండయ్య	చిప్పగిరి	మద్దికెర
ఎం శ్రీనివాసులు	డోన్	ఓర్వకల్
ఏ శ్రీనివాసరావు	గడివేముల	ప్యాపిలి
ఎంజీ ప్రవీణ్‌కుమార్	గోనెగండ్ల	పాణ్యం
ఎంహెచ్ సుహాసినమ్మ	హొళగుంద	వెల్దుర్తి
ఎస్ మంజులావాణి	జూపాడుబంగ్లా	చాగలమర్రి
ఎన్ చంద్రశేఖర్	కోడుమూరు	పాములపాడు
పీ రాజేంద్రప్రసాద్	కోసిగి	ఆదోని
కే విశ్వమోహన్	కృష్ణగిరి	తుగ్గలి
జీ నాగశేషాచలరెడ్డి	మిడ్తూరు	కల్లూరు
పీ దశరథరామయ్య	నందవరం	మిడ్తూరు
ఎం శోభారాణి	నందికొట్కూరు	పత్తికొండ
ఏ శివనాగప్రసాద్	ఓర్వకల్	గూడురు
జీ వెంకటేశ్వరరెడ్డి	అవుకు	డోన్
జీవీ రమణ	పగిడ్యాల	బనగానపల్లె
డీ గోపీక్రిష్ణ	పాములపాడు	జూపాడుబంగ్లా
మూలింటి దస్తగిరి	పాణ్యం	బండి ఆత్మకూరు
ఎం కవిత	పత్తికొండ	పగిడ్యాల
ఎం ఫజుల్ రహమాన్	ప్యాపిలి	బేతంచెర్ల
పీ మధుసూధన్‌రెడ్డి	రుద్రవరం	వెలుగోడు
కేవీ సుబ్రమణ్యం	శిరివెళ్ల	ఆత్మకూరు
కే సావిత్రి	తుగ్గలి	దొర్నిపాడు
సీ శివ మల్లేశ్వరప్ప	వెల్దుర్తి	శిరివెళ్ల
ఎస్ అమానుల్లా	వెలుగోడు	ఆలూరు
ఎం మణిమంజరి	మంత్రాలయం	గోనెగండ్ల
పీ సుమిత్రమ్మ	అనంతపురం	మంత్రాలయం
డీ సుబ్రమణ్యశర్మ	వైఎస్సార్ కడప	నందికొట్కూరు
కే వరలక్ష్మి	అనంతపురం	హాలహర్వి
వై పుల్లయ్య	అనంతపురం	నందవరం
పీ విజయ లలిత	అనంతపురం	హొళగుంద
కే వరప్రసాదరావు	వైఎస్సార్ కడప	కోవెలకుంట్ల
ఎన్ భాగ్యలక్ష్మి	వైఎస్సార్ కడప	రుద్రవరం
జీ రఘునాథ్	అనంతపురం	కర్నూలు
ఐ సోలమన్	అనంతపురం	సంజామల

ఎక్సైజ్ శాఖలో కొనసాగుతున్న బదిలీలు

- ఉమ్మడి జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్‌గా రాజశేఖర్ గౌడ్
- కర్నూలు ఐఎంఎల్ డిపో మేనేజర్‌గా శ్రీధర్‌రావు

కర్నూలు: ఎక్సైజ్ శాఖ ఉమ్మడి కర్నూలు జిల్లాలో బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. సెబ్ విభాగంలో ఉన్న వారిని ఎక్సైజ్ శాఖకు కేటాయించడమే కాక వారిని బదిలీ చేసి పోస్టింగులు కేటాయించారు. మొదట డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ స్థాయి అధికారులకు బదిలీలు చేపట్టారు. గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్, డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్, ఐఎంఎల్ డిపోకు అధికారులను నియమిస్తూ బదిలీల జాబితా విడుదలైంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన ఈ బదిలీల్లో నేతల సిఫారసు లేఖలకే అధిక ప్రాధాన్యత ఇచ్చారు.

టాస్క్‌ఫోర్స్ ఏఈఎస్‌గా రాజశేఖర్ గౌడ్

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎక్సైజ్ నేరాల నియంత్రణకు ఏర్పడిన ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా రాజశేఖర్ గౌడ్ నియమితులయ్యారు. హిందూపురం సెబ్ విభాగంలో పనిచేస్తూ ఏఈఎస్‌గా పదోన్నతి పొందారు. బదిలీల్లో భాగంగా జిల్లాకు వచ్చారు. 2005వ బ్యాచ్‌కు చెందిన ఈయన ఎస్‌ఐ, సీఐగా కర్నూలు, అనంతపురం జిల్లాల్లో పనిచేశారు.

- కర్నూలు జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ విభాగానికి రామకృష్ణారెడ్డి నియమితులయ్యారు. ఈయన గతంలో కర్నూలులో సీఐగా పనిచేశారు. నంద్యాలలో ఏఈఎస్‌గా పనిచేస్తున్న ఈయన బదిలీల్లో భాగంగా కర్నూలుకు వచ్చారు.
- నంద్యాల జిల్లా టాస్క్‌ఫోర్స్ విభాగానికి రాముడు నియమితులయ్యారు. ఈయన తిరుపతి ఐఎంఎల్ డిపోలో పనిచేస్తూ నంద్యాలకు బదిలీ అయ్యారు. అనంతపురం, కర్నూలు జిల్లాల్లో పనిచేశారు.
- కర్నూలు ఐఎంఎల్ డిపో మేనేజర్‌గా శ్రీధర్‌రావు నియమితులయ్యారు. చిత్తూరు నుంచి ఈయన కర్నూలుకు బదిలీపై వస్తున్నారు.

వంతెన రక్షణ గోడను ఢీకొన్న సిమెంట్ లారీ

- చెలరేగిన మంటలు
- డ్రైవర్‌కు తప్పిన ప్రాణాపాయం


క్యాబిన్ నుంచి డ్రైవర్‌ను బయటకు తీస్తున్న పోలీసులు

చాగలమర్రి: మండలంలోని మద్దూరు మెట్ట సమీపంలో 40వ నంబరు జాతీయ రహదారిపై ఉన్న వంతెన రక్షణ గోడను సిమెంట్ లారీ ఢీకొంది. గురువారం తెల్లవారుజామున చోటు చేసుకున్న ఈ ఘటనలో మంటలు చెలరేగి లారీ పూర్తిగా కాలిపోగా డ్రైవర్‌కు ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. బనగానపల్లె నుంచి మహాసిమెంట్ బస్తాలలోడ్‌తో లారీ చెన్నైకు వెళ్తుంది. గురువారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు మద్దూరు మెట్ట సమీపంలోని జాతీయ రహదారిపై వంతెన రక్షణ గోడను ఢీ కొట్టింది. ఓ వైపు మంటలు చెలరేగి లారీ కాలిపోతుండగా మరోపక్క డ్రైవర్ వేల్ మురుగన్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న చాగలమర్రి ఎస్‌ఐ రమేష్‌రెడ్డి హుటాహుటిన సిబ్బందితో అక్కడికి చేరుకుని క్యాబిన్ పగలగొట్టి క్రేన్ సహాయంతో డ్రైవర్‌ను సురక్షితంగా బయటకు తీశారు. తర్వాత ఆళ్లగడ్డ అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనపై డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విధుల్లో చేరిన ఎక్సైజ్ ఉన్నతాధికారులు


కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలసిన ఎక్సైజ్ డీసీ పోతుల శ్రీదేవి

కర్నూలు: ఎక్సైజ్ శాఖ ఉమ్మడి జిల్లా డిప్యూటీ కమిషనర్ పోతుల శ్రీదేవి తన ఛాంబర్‌లో గురువారం విధుల్లో చేరారు. 2008లో గ్రూప్-1 ద్వారా ఏఈఎస్‌గా ఎక్సైజ్ శాఖలో చేరిన ఈమె మొదట మహబూబ్‌నగర్‌లో విధులు నిర్వహించారు. 2013లో ఈఎస్‌గా పదోన్నతి పొంది అమలాపురం, 2017లో అసిస్టెంట్ కమిషనర్‌గా కాకినాడలో పనిచేశారు. 2023 నుంచి సెబ్‌లో పనిచేస్తూ హెడ్ క్వార్టర్ కార్యాలయం నుంచి కర్నూలుకు బదిలీపై వచ్చారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆమెను ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది కలసి అభినందించారు.

- అసిస్టెంట్ కమిషనర్ రావిపాటి హనుమంత రావు కూడా విధుల్లో చేరారు. 1996వ బ్యాచ్‌కు చెందిన ఈయన మూడవ జోన్ పరిధిలోని వివిధ జిల్లాల్లో పనిచేశారు. ఏఈఎస్‌గా పదోన్నతి పొంది నంద్యాల, ఈఎస్‌గా పదోన్నతి పొంది ఒంగోలు ప్రాంతాల్లో పనిచేశారు.

కలెక్టర్‌తో భేటీ...

జిల్లా ఉన్నతాధికారులుగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు జిల్లా కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి ఎక్సైజ్ శాఖలో వచ్చిన మార్పులు, నూతన ఎక్సైజ్ విధానం జిల్లాలో నూతన ఎక్సైజ్ విధానం అమలుపై చర్చించారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు కూడా వీరి వెంట ఉన్నారు.

హాస్టళ్లలో బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థుల బయోమెట్రిక్ హాజరు తప్పనిసరని ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ జె.రంగలక్ష్మీదేవి అన్నారు. గురువారం సాయంత్రం ఆమె సంక్షేమభవన్‌లోని తన చాంబర్‌లో జిల్లాలోని సహాయ సంక్షేమాధికారులు, వసతి గృహ సంక్షేమాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ ప్రతి వసతి గృహాన్ని శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు మెనూ తప్పక పాటించాలన్నారు. వసతి గృహ సంక్షేమాధికారులు తాము పనిచేస్తున్న ప్రాంతాల్లోనే ఉంటూ సమయ పాలన పాటించాలన్నారు. హాస్టల్స్‌లో విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహించాలని, అలాగే ఆయా సబ్జెక్టులకు ట్యూటర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో సహాయ సంక్షేమాధికారులు కె.బాబు, ఎస్.లీలావతి, బి.మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

జల వనరుల శాఖలో బదిలీలు

కర్నూలు సిటీ: జల వనరుల శాఖ పరిధిలోని వివిధ సర్కిళ్లు, డివిజన్లలో పని చేస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లను బదిలీలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయి ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు ప్రాజెక్ట్స్ సీఈ కార్యాలయంలో డిప్యూటీ సీఈగా పని చేస్తున్న సుగాలి లక్ష్మా నాయక్‌ను శ్రీశైలం డ్యాం నిర్వహణ విభాగం డిప్యూటీ సూపరింటెండెంట్‌గా, తెనాలిలో పని చేస్తున్న ఎస్.మల్లికార్జునను సైతం శ్రీశైలం డ్యాం నిర్వహణ విభాగానికి బదిలీ చేశారు. వీరితో పాటు కేసీ కాలువ ఈఈగా ఖాళీగా ఉన్న స్థానంలో చిత్తూరు జిల్లాలో పని చేస్తున్న సి.ప్రతాప్‌ను నియమించారు. శ్రీశైలం డ్యాం నిర్వహణ విభాగంలో ఈఈగా పని చేస్తున్న గుజ్జుల శ్రీనివాసులును కర్నూలు చిన్న నీటిపారుదల శాఖ ఈఈగా నియమించి, ఇక్కడ ఈఈగా పని చేస్తూ కర్నూలు సర్కిల్ ఇన్‌చార్జ్ ఎస్‌ఈగా పని చేస్తున్న రెడ్డి శేఖర్ రెడ్డి పుల్లారెడ్డిని తుంగభద్ర దిగువ కాలువ అనంతపురం డివిజన్‌కు బదిలీ చేశారు. చిన్ని నీటిపారుదల శాఖ వైఎస్‌ఆర్ కడప డివిజన్‌లో ఈఈగా పని చేస్తున్న బాల చంద్రారెడ్డిని కర్నూలు సర్కిల్ డిప్యూటీ సూపరింటెండెంట్‌గా నియమించారు. ఈయనకే కర్నూలు సర్కిల్ ఎస్‌ఈగా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించనున్నారు. ఇందుకు సంబంధించిన ఆర్డర్ రెండు, మూడు రోజుల్లో వచ్చే అవకాశం ఉన్నట్లు ఇంజినీరింగ్ వర్గాలు తెలిపాయి. ఎస్‌ఆర్‌బీసీ సర్కిల్-2లోని ఎస్‌ఆర్‌బీసీ డివిజన్-1 పాణ్యంలో ఈఈగా పని చేస్తున్న ఎల్.ఎస్ వర ప్రసాద్‌ను అదే సర్కిల్-2 డిప్యూటీ సూపరింటెండెంట్‌గా నియమించారు. ఎస్‌ఆర్‌బీసీ సర్కిల్-1లో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న బండారు రాజేంద్ర ప్రసాద్‌ను కర్నూలు ప్రాజెక్ట్స్ సీఈ కార్యాలయంలో డిప్యూటీ సీఈగాను, తుంగభద్ర దిగువ కాలువ ఈఈగా పురుషోత్త పట్నం డివిజన్-6లో ఈఈగా పని చేస్తున్న పి.పాండురంగయ్యను నియమించారు. ఈఈలతో పాటు డీఈఈ, ఏఈఈలను సైతం బదిలీలు చేశారు. అయితే ఎక్కడెక్కడికి బదిలీలు చేసిన జాబితా విడుదల కాలేదు.

బాలికల పాఠశాలలోకి చొరబడ్డ అగంతకులు

- భయాందోళనకు గురైన విద్యార్థినులు
- గట్టిగా కేకలు వేయగానే పరార్



పాణ్యం ఆశ్రమ పాఠశాల

పాణ్యం: మండలకేంద్రం పాణ్యం చెంచుకాలనీలోని బాలికల ఆశ్రమ పాఠశాలలోకి ముగ్గురు అగంతకులు చొరబడ్డారు. గమనించిన బాలికలు గట్టిగా కేకలు వేయడంతో పరారయ్యారు. బుధవారం రాత్రి జరిగిన ఈ ఘటన వివరాలు ప్రిన్సిపాల్ సునందలక్ష్మి తెలిపిన మేరకు .. ఆశ్రమ పాఠశాలలో మొత్తం 320మంది బాలికలు ఉన్నారు. వీరు బుధవారం సాయంత్రం భోజనం చేసి వారి గదుల్లోకి వెళ్లారు. చీకటి పడిన తర్వాత గుర్తు తెలియని ముగ్గురు యువకులు కాంపౌండ్ వాల్ దూకి పాఠశాల్లోకి చొరబడ్డారు. అక్కడి నుంచి విద్యార్థినులు ఉండే గదులపైకి ఎక్కారు. శబ్దం కావడంతో గమనించిన విద్యార్థినులు గట్టిగా కేకలు వేసుకుంటూ బయటకు వచ్చారు. వెంటనే విషయం పాఠశాల సిబ్బంది, ప్రిన్సిపాల్‌కు తెలియజేయడంతో వారు గదులపైకి ఎక్కి చూడగా ముగ్గురు యువకులు గొడలు దూకి కాంపౌండ్ వాల్ నుంచి పక్కనే ఉన్న వరి పొలాల్లోకి పారిపోయారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు పాణ్యం సర్కిల్ కార్యాలయంలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. తక్కువ ఎత్తు ఉన్న కాంపౌండ్ వాల్ ద్వారా అగంతకులు పాఠశాలలోకి చొరబడటంతో విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. మరోసారి ఇలాంటి సంఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.